క్లుప్తంగా

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



కోలాట ప్రదర్శనలో చిన్నారులు

వేముల : మండలంలోని పెర్నపాడు గ్రామంలో ఏడాది పూర్తయిన సందర్భంగా శ్రీరామాలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, ఆయన సతీమణి నాగేళ్ల సత్యప్రభావతమ్మ, జెడ్పీటీసీ వెంకటబయపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ మరకాశివకృష్ణారెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రీసర్వే పక్కాగా చేపట్టాలి



కొండూరు పొలాల్లో రీసర్వేను పరిశీలిస్తున్న జిల్లా సర్వే డీఐ ప్రభాకర్

పెండ్లిమర్రి : రైతులకు భూసమస్యలు రాకుండా రీసర్వే పక్కాగా చేపట్టాలని జిల్లా సర్వే డీఐ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొండూరులో చేపడుతున్న రీసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్క ఎకరా రీ సర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రతి భూమికి సర్వే హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతుల అర్జీలకు అధికారుల వివరణ



రైతుల సమస్యలకు వివరణ ఇస్తున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

లింగాల : గతనెలలో రెవెన్యూ అధికారులు మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో ప్రజలు, రైతులు ఇచ్చిన సమస్యలపై వివరణ ఇచ్చేందుకు తిరిగి ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. మంగళవారం పెద్దకుడాల గ్రామంలో రైతుల నుంచి వచ్చిన అర్జీలకు వివరణ ఇచ్చారు. సమస్య, వాటి పరిష్కారం, వంటి వాటిని రైతులకు, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్య, ఆర్ఐ గంగాధరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమం



నాయకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐలు

సింహాద్రిపురం : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన దిద్దేకుంట్ల గ్రామంలో మంగళవారం రాత్రి పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ తులసీ నాగప్రసాద్‌లు పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని నాయకులకు ప్రశాంత వాతావరణంలో జీవించాలని, ఫ్యాక్షన్ తో మనశ్శాంతి కోల్పోవడంతోపాటు కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. అలాగే పిల్లల భవిష్యత్‌ను మీ చేతులారా మీరే నాశం చేసినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

వల్లూరు : గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికై ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తహసీల్దార్ ఆయా గ్రామ సచివాలయాల్లో అందుబాటులో వుంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కడప ఆర్‌డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. వల్లూరు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల మంజూరెప్పుడో..

- అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్త రేషన్ కార్డుల ఊసేలేదు
- సచివాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు
- పేదలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- మండలంలో 20785 కార్డులు



ఎర్రగుంట్ల : కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు షాక్ ఇస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క కొత్త రేషన్‌కార్డు మంజూరు చేసిన దాఖలాలు లేవు. రేషన్ కార్డుల కోసం ప్రజలు సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సచివాలయ సిబ్బంది చెబుతుండటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. అలాగే రేషన్ కార్డులతో మార్పులు చేర్పులు కూడా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే కార్డులు

2019–2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుతవ హయాంలో సచివాలయ ఉద్యోగులు వలంటీర్ల ద్వారా అర్హులైన వారందరికీ ఇంటి వద్దకే రేషన్ కార్డులు అందించారు. అధికారంలోకి వచ్చేందుకు చాలా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం గెలిచాక ప్రజల శ్రేయస్సును విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడస్తున్నా రేషన్ కార్డుల ఊసే ఎత్తడం లేదు. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు అర్హుల ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు. కార్డు మంజూరు అయ్యాక ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులకు రేషన్ కార్డులు అందాయి.

మళ్లీ 2014 మాదిరిగానే ఇస్తారా..!

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అరకొరగా రేషన్‌కార్డులను మంజూరు చేసింది. అప్పట్లో జన్మభూమి కమిటీల పెత్తనంతో కార్డుల మంజూరయ్యేవి. దీంతో చాలా మంది అర్హులకు కార్డులు దక్కలేదు. ఈ కారణంగా కార్డులు రాని వారు నిరాశకు గురయ్యేవారు. చాలా మంది ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. కనీసం నిత్యావసర సరుకులు అందక ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కార్డుల మంజూరులో కూటమి నేతల జోక్యం చేసుకుంటే రేషన్ కార్డుల మంజూరులో కోతలు పడే అకవాశాలున్నాయని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలి



మండలంలో అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి. అలాగే రేషన్ కార్డులో కొత్త సభ్యులను చేరిృంచేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులు అవకాశం కల్పించాలి. ప్రభుత్వ సేవలు, పథకాలు మొదలగు వాటన్నింటికి రేషన్‌కార్డుల అవసరం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాలు దక్కాలంటే తప్పనిసరిగా అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలి.

– శరత్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, ఎర్రగుంట్ల

కార్డులు మంజూరు శూన్యం



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తూచ్ అనిపించింది. ఆ మాదిరిగానే కొత్త రేషన్‌కార్డుల మంజూరు కూడా శూన్యంగా అయింది. కొత్త రేషన్ కార్డులు అర్హులైన వారందరికి అందించాలి. రేషన్‌కార్డుల వుంటేనే అన్ని పథకాలు వర్తిస్తాయి. పేదలకు కొత్త రేషన్ కార్డుల కోసం సచివాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు.

– మల్లు కేశవరెడ్డి, ఎర్రగుంట్ల

ప్రభుత్వం మంజూరు చేస్తే అర్హులకు అందిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొత్త రేషన్‌కార్డులు మంజూరు అయితే విచారణ చేసి అర్హులకు అందిస్తాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రేషన్ కార్డుల విషయంలో ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఆదేశాలు, ఉత్తర్వులు వచ్చిన వెంటనే మండల వ్యాప్తంగా అర్హులకు విచారణ చేసి అందిస్తాం.

– శోభన్‌బాబు, తహసీల్దార్, ఎర్రగుంట్ల

ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోండి



కబ్జాకు గురైన భూములను పరిశీలిస్తున్న దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దులకొండ్రాయుడు

వేంపల్లె : పట్టణంలోని ఎద్దులకొండ ఆలయ సమీపంలో ఉన్న పాపాఘ్ని నది ఆక్రమణకు గురి కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని వృషబాచలేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దులకొండ్రాయుడు, పీవీ రమణలు కోరారు. మంగళవారం వేంపల్లెలోని పాపాఘ్ని నదిలో కబ్జాకు గురై సాగు చేసిన భూములను వారు పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆలయం వద్ద ప్రతి ఏడాది జనవరి 1, సంక్రాంతి, ఉగాది పండుగల రోజున ప్రత్యేక పూజలు జరగడంతో జనాలు విపరీతంగా దర్శించుకునేందుకు వస్తుంటారని, అలాగే బ్రహ్మోత్సవాలు కూడా జరపడం జరుగుతోందన్నారు. అటువంటి స్థలాన్ని ఆక్రమించడంతోపాటు కంచె వేసి భూములను తయారు చేశారని ఆరోపించారు. పాపాఘ్ని నదిలో ఉన్న రాజు కాలువ కూడా పూడ్చడంతోపాటు మట్టిని తోలి భూములను సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో పాపాఘ్ని నది అంతా ఆక్రమణకు గురవుతున్నట్లు తెలిపారు. పట్టా భూములకే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అధికారులు ఇవ్వడం లేదన్నారు. అలాంటిది వందల ఏకరాలు భూములు సాగు చేసుకుని విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్లతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆక్రమణకు గురైన భూములను రెవెన్యూ అధికారులు తొలగించాలని, రాజు కాలువను కూడా చదును చేసి 4 మీటర్ల అవతల సిమెంట్ స్తంభాలు నాటి కంచె వేయడం గర్హణీయమన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన చెట్లను, రోడ్డును కూడా ఆక్రమించి స్తంభాలు నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అలిరెడ్డిపల్లె బాలకృష్ణారెడ్డి, గోగుల మారుతిలు పాల్గొన్నారు.

రసాభాసగా స్వయం సహాయక సంఘాల సమావేశం



సమావేశంలో వారిస్తున్న పోలీసులు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె స్వయం సహాయక సంఘాల సర్వసభ్య సాధారణ సమావేశం రసాభాసగా మారింది. మంగళవారం కొత్తపల్లె సచివాయంలో ఈ సమావేశం నిర్వహించారు. కొంత కాలం నుంచి ఎస్‌హెచ్‌జీలకు చెందిన యానిమేటర్‌ను తొలగించడానికి అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అయితే అధిక శాతం మంది సభ్యుల మద్దతు వున్న యానిమేటర్‌ను ఎలా తొలగిస్తారని సభ్యులు సమావేశంలో నిలదీశారు. తాను ఏ తప్పు చేయకున్నా చేసినట్లు ఆరోపిస్తున్నారని, తాను అక్రమాలకు పాల్పడినట్లు నిరూపించాలని యానిమేటర్ లక్ష్మిదేవి వాపోయారు. తనను విధుల నుంచి తొలగించకుండా మరొకరితో పనిచేయిస్తున్నారని, తనను తొలగించడానికి ప్రయత్నించడం తగదని ఆమె తెలిపారు. దీంతో సమావేశానికి హాజరైన సభ్యురాళ్ళు, ఏపీఎంసీసీలు వాదోపవాదాలతో సమావేశం రసాభాసగా మారింది. ఒక దశలో సమావేశానికి బందోబస్తుగా వచ్చిన పోలీసులు వారిని వారించి శాంతింపజేశారు. గ్రామంలోని పలు గ్రూపులు యానిమేటర్‌పై ఫిర్యాదు చేసారని, దీంతో యానిమేటర్‌ను తప్పుకోవాలని సూచించనట్లు ఏపీఎం అపర్ణ తెలిపారు. సాధారణంగా నిర్వహించే డ్వాక్రా సభ్యుల సమావేశానికి పోలీసులు బందోబస్తుగా రావడం గమనార్హం.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతిపై శిక్షణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ సునీత

వేంపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై శిక్షణ నిర్వహించినట్లు వేంపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ వి.సునీత తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లల అభివృద్ధి, ప్రారంభ సంవత్సరం ప్రాముఖ్యతను జాతీయ విద్యావిధానం తెలియజేస్తుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా వయస్సుకు తగిన ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఇసీసీఇ) ప్రీ స్కూల్ కృత్యాలు, అలాగే మహిళా, శిశు సంక్షేమ శాఖ అందించిన ప్రీ స్కూల్ కిట్లను ఉపయోగించడం, అంగన్‌వాడీ విద్యా ప్రణాళికను అమలు చేయడంలో సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, నాగరత్న, ఎంఈఓ స్టాలిన్, హెచ్‌ఎం శివమునెమ్మ, డీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేంపల్లె : అమ్మ అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ ఆధ్వర్యంలోఅన్నదానం చేశారు. అనకాపల్లి బీజేపా ఎంపీ సీఎం రమేష్ నాయుడు జన్మదినం సందర్భంగా వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సన్మానం



బదిలీపై వెళుతున్న వైద్యులను సత్కరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు స్వాతిసాయి, నిజాముద్దీన్‌లు బదిలీ కావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఆరోగ్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. డాక్టర్ స్వాతిసాయి కర్నూలు మెడికల్ కళాశాలలో ఎండీ జనరల్ మెడిసిన్‌గా చేరారు. అలాగే డాక్టర్ నిజాముద్దీన్ సిద్దార్థ మెడికల్ కళాశాలలో (పైథాలజీ) ఎండీగా చేరారు. వీరు నీట్ పీజీ 2024లో ప్రతిభ చూపి ఇన్ సర్వీస్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో రాణించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నిసా బేగం, పులివెందుల డివిజన్ మెడికల్ ఆఫీసర్స్ శివప్రసాద్, మొహమ్మద్ తహ, శరణ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

వేంపల్లె : స్థానిక గాంధీ రోడ్డులో ఉన్న డాక్టర్ ఎస్ఎఫ్ బాషా హాస్పిటల్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి వైద్య నిపుణులు డాక్టర్ గురు అభిలాష్ కంటికి సంబంధించి వైద్య సేవలు అందించారు. 30మందికి అభిలాష్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఆపరేషన్‌కి రెఫర్ చేసినట్లు సిబ్బంది వెల్లడించారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. శిక్షణకు టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు 18–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. బెంగుళూరులో 35 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణానంతరం ప్రతిభనుబట్టి ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

కమలాపురం : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో స్థానిక క్రాస్ రోడ్డు వద్ద ప్రజలకు దొంగతనాల పట్ల అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ మధ్య కాలంలో జిల్లాలో తాళం వేసి వెళ్లిన ఇళ్లలో దొంగతనాలు జరిగాయన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో చాలా మంది బయట నిద్రిస్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు విలువైన ఆభరణాలు, నగదు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్ర పరచుకోవాలన్నారు. పొలం పనులకు, వాకింగ్‌కు, పశువులు మేపు కోవడానికి వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు ధరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక వేళ ఆభరణాలు ధరిస్తే అవి కనబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మీ కాలనీల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కమలాపురం ఎస్ఐ 91211 00532, సీఐ 91211 00529 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అలాగే స్థోమత ఉన్న వారు మీ ఇళ్లల్లో లేదా ఐదారు మంది కలసి వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆటోలో మైక్‌తో దొంగతనాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలు స్వచ్ఛందంగా ఆరోగ్య సర్వేలో పాల్గొనాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

చింతకొమ్మదిన్నె : స్థానిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరగుతున్న జాతీయ సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల సర్వే 3.0 పరిశీలన, పర్యవేక్షణలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌ఓ నాగరాజు జె.నారాయణపురం, ఎన్.టి.అర్ కాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల బారిన పడటానికి అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించడానికి ప్రాథమిక పరీక్షలు జరిపి అనుమానితులను వైద్యుల వద్దకు సిఫారసు చేస్తామన్నారు.ఈ సందర్భంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోని దాదాపు 17 మంది ఆరోగ్య కేంద్రం సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం కోర్డినేటర్ రమేష్, పర్యవేక్షకుడు రాఘవ, వైద్యాధికారి రాఘవేంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు జనార్ధన్, జయరత్నమ్మ పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా

చింతకొమ్మదిన్నె : మహిళా పోలీస్‌స్టేషన్ కడప యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో బాలలకు సంబంధించిన చట్టాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల విద్యాశాఖాధికారి రమాదేవి మాట్లాడుతూ పిల్లలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్స్ జి.మహేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రత్యేకంగా బాలల న్యాయ చట్టం ఉందని 18 సంవత్సరాలలోపు పిల్లలందరూ ఈ చట్టం పరిధిలోకి వస్తారన్నారు. పిల్లలు తమ సమస్యలను చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు, పోలీస్ కానిస్టేబుల్ రాజేష్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



లారీ ఢీ కొట్టడంతో విరిగి పడ్డ విద్యుత్ స్తంభం

మైలవరం : వద్దిరాలలో సోలార్ ప్రాజెక్ట్ వద్దకు సిమెంట్ పైపుల లోడ్‌తో వెలుతున్న భారీ వాహనం మంగళవారం విద్యుత్ స్తంభాన్ని ఢీకోంది. దీంతో స్తంభం విరిగి లారీపై పడింది. అదృష్టవశాత్తు 5 నిముషాల మునుపే రైతులు ఎల్‌సీ తీసుకోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. లేదంటే పెద్ద ప్రమాదమే జరిగిఉండేదని స్థానికులు చెబుతున్నారు. వద్దిరాల నుంచి దొడియం వెళ్లె ఇరుకైన దారిలో బారీ వాహానాల రాకపోకలను నిషేధించాలని వద్దిరాల గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపుల నివాస గృహాలు దుకాణాలు ఉండటంతో అధిక లోడ్‌తో వెలుతున్న గూడ్స్ వాహానాలతో ప్రమాదం పొంచి ఉందని వారు వాపోతున్నారు.

రైతుభరోసా కేంద్రం మూతతో ఇక్కట్లు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లెలోని రైతు భరోసా కేంద్రం కొన్ని రోజుల నుంచి సక్రమంగా తెరవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొత్తపల్లె రైతులకు, పాడి యజమానులకు రైతు భరోసా కేంద్రం మూతబడటంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. సాధారణంగా రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ లేదా, హార్టికల్చర్ అసిస్టెంట్ పశుసంవర్ధక శాఖ సహాయకులు గానీ నత్యం అందుబాటులో వుండాలి. అయితే కొంత కాలంనుంచి వీరిలో ఎవరూ రైతుభరోసా కేంద్రానికి హాజరుకాకపోవడంతో కార్యాలయం తెరవడంలేదని ఒక వేళ తెరిచినా మధ్యాహ్నం 12 గంటలనుంచి మూతబడుతోందని స్థానికులు అంటున్నారు. ఇందులో పని చేసే సిబ్బందిలో ఒకరు సెలవులో వున్నారని, ఇన్‌చార్జి, మరొక సిబ్బంది గైర్హాజరవుతుండటంతో ఈ ఇబ్బంది తలెత్తుతోందన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన యువతీ యువకులు



ఇంటర్వ్యూ నిర్వహణలో పాల్గొన్న అధికారులు, బ్యాంకుల మేనేజర్లు

కమలాపురం : మండలంలో నిర్వహించిన బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 120 మంది హాజరయ్యారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ జ్యోతి సమక్షంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు కమలాపురం ఏపీజీబీ, ఎస్‌బీఐ, కోగటం ఎస్‌బీఐ, పెద్దచెప్పలి ఏపీజీబీ బ్యాంక్ సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 36 యూనిట్లు మంజూరు కాగా, అందుకు 225 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ జ్యోతి వివరించారు.

చింతకొమ్మదిన్నె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం బీసీ కార్పొరేషన్‌లో లోన్ల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బ్యాంక్ మేనేజర్లు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 49 లోన్లకు గాను 705 మంది దరఖాస్తు చేసుకోగా, కేవలం 215 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుల్లాయి బాబు, వివిధ బ్యాంకు శాఖల మేనేజర్లు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన వారికి సబ్సిడీ రుణాలు

జమ్మలమడుగు : అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి బీసీ, కాపులకు రుణాలు మంజూరవుతాయని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో బీసీలతోపాటు కాపు రుణాలకోసం దరఖాస్తులు చేసుకున అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకర్లకు లబ్ధిదారులు రుణాలు పొంది ఎటువంటి వ్యాపారాలు చేస్తారో వివరించాలని సూచించారు. లబ్ధిదారులను బ్యాంకర్లు ఎంపిక చేసిన తర్వాత వారి నిబంధనలు ప్రకారం నడుచుకోవలసి ఉంటుందన్నారు. రుణాలు పొందిన వారికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని సూచించారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

వల్లూరు : బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. తహసీల్దార్ రఘురాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వేంపల్లెలో..

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం మంజూరు చేసిన సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుళాయమ్మ తెలిపారు. మండలానికి బీసీ కార్పొరేషన్‌కు 27, కాపు 7, ఈబీసీకి 4 సబ్సిడీ యూనిట్లు మంజూరయ్యాయన్నారు. లబ్దిదారులు వేంపల్లె ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగే ఇంటర్వ్యూలకు సంబంధిత పత్రాలు తీసుకుని హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర బడ్జెట్ అన్ని ప్రాంతాలను సమన్యాయం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 24 నుంచి 28 వరకు ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని ప్రాంతాలకు, వర్గాలకు సమన్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సత్తార్, వైఎస్ఆర్‌సీపీకి చెందిన శివ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి వేదిక సభ్యుడు బి. నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ×రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్ల పై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలకు, వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయ రంగానికి, పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేయాలని తెలిపారు. రాయలసీమ వెనుకబాటు తనాన్ని దృష్టిలో పెట్టుకొని కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, ప్రాజెక్టుల నిర్మాణాలకు కృషి చేయాలని కోరారు. అభివృద్ధిని వికేంద్రీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు, వామపక్ష చేతి వృత్తుల ఐక్యవేదిక నాయకుడు అవ్వారు మల్లికార్జున, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నేత రవిశంకర్ రెడ్డి, ప్రసాదు, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుడు సీఆర్‌వీ ప్రసాద్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

8న జాతీయ సదస్సు

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ శ్రామిక మహిళా జాతీయ సదస్సు మార్చి 8న లక్నోలో జరుగనుందని శ్రామిక మహిళా కడప డివిజన్ కన్వీనర్ పి.వసుప్రద తెలిపారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఈ మేరకు శ్రామిక మహిళా జాతీయ సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ దేశ ఆర్థిక రంగంలో మారిన పరిస్థితుల్లో బీమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ సదస్సు చర్చిస్తుందని తెలిపారు. సంస్కరణలు అమలైన 25 సంవత్సరాల కాలంలో ప్రభుత్వాల విధానాలు, శ్రామిక మహిళల జీవితాల్లో గొప్పగా మార్పు తేలేదని అన్నారు. ఇప్పటికీ సమాన పనికి సమానమైన వేతనం, కనీస వేతనాలు అనేక రంగాల్లో అమలు కావడం లేదని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు చట్టసభల్లో ఆమోదం పొందినా, అది తక్షణం అమలులోకి వచ్చే అవకాశం లేదన్నారు. వీటితోపాటు బీమా రంగంలోని మహిళల ప్రత్యేక సమస్యల్ని కూడా సదస్సు చర్చిస్తుందని అన్నారు.